# సాక్షి
## సూర్యాపేట
ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023






### ఎస్పీకి మంత్రి పరామర్శ
పితృ వియోగం పొందిన మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ నర్సింహగౌడ్‌ను శనివారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. - IIలో



### దైవ దర్శనానికి వెళ్తూ..
దైవ దర్శనానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలైన సంఘటన అయిటిపాములలో చోటుచేసుకుంది. - IIలో

### వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 39°/26°

ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది.

## న్యూస్‌రీల్

### రైతులను ఆదుకోవాలి
దురాజ్‌పల్లి(సూర్యాపేట): అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే తగిన పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి సూర్యాపేట జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వరి పంట బాగా దెబ్బతిన్నదని, ఐకేపీ కేంద్రాల్లో పోసిన ధాన్యం కొట్టుకుపోయిందని ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. అధికారులు తక్షణమే ఐకేపీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించాలని కోరారు.

### మట్టపల్లిలో నృసింహుడి కల్యాణం
మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అనంతరం స్వామిఅమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. ఆ తర్వాత కల్యాణం జరిపి నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, ఆలయ ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాబాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.

### 272 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



రామన్నగూడెంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, సివిల్ సప్లయ్ డీఎం

అర్వపల్లి: యాసంగి సీజన్ ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి జిల్లాలో ఇప్పటి వరకు 272 కేంద్రాలను ప్రారంభించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు తెలిపారు. జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం, కుంచమర్తి, జాజిరెడ్డిగూడెం గ్రామాల్లో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పౌరసరఫరాల శాఖ డీఎం రాంపతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసీజన్‌కు 292 కేంద్రాలను ఏర్పాటు చేసి, 7లక్షల మెట్రిక్ టన్నుల ధ్యాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు రూ.13కోట్ల విలువ చేసే 6వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. సేకరించిన ధాన్యాన్ని 37 మిల్లులకు కేటాయిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో కోటి గన్నీసంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పెద్దగా నష్టం ఏర్పడలేదని తెలిపారు. ధాన్యం ఎక్కడైనా తడిస్తే వెంటనే ఆరబోసుకొని ఎండబెట్టాలని సూచించారు. ధాన్యం రవాణాకు లారీల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ సీఈఓ రామస్వామి, సిబ్బంది ఉన్నారు.

### రేపటి నుంచి శుభవార్త చర్చి ఉత్సవాలు
మఠంపల్లి: జిల్లాలో క్రైస్తవులకు ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతున్న మఠంపల్లిలోని శుభవార్త చర్చి వార్షికోత్సవాలకు సిద్ధమైంది. ఈనెల 24న ప్రత్యేక ప్రార్థనలతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. 25న జరిగే దివ్యబలి పూజకు నల్లగొండడ మేత్రాసన పీఠాధిపతి (బిషప్) పూల ఆంథోని ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచి క్రైస్తవులు అధికసంఖ్యలో హాజరుకానున్నారు. చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించి ఏర్పాట్లు చేశామని చర్చి ఫాదర్ మార్టిన్ తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా శుభోదయ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో రాత్రి మహిళలకు కోలాటం, 28న స్థానిక మౌంట్‌ఫోర్డ్ పాఠశాల ఆవరణలో గొర్రె పొటేళ్ల పోటీలు నిర్వహించనున్నట్లు శుభోదయ యూత్ అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి తెలిపారు. విజేతలకు రూ.2లక్షల వరకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



ముస్తాబైన శుభవార్త చర్చి

## • భక్తిశ్రద్ధలతో రంజాన్



రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని భాషానాయక్‌తండా వద్ద ఈద్గాలో శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

# కిరణ్‌బేడీ స్ఫూర్తి



- నాన్న ప్రోత్సాహంతో సివిల్స్ వైపు
- కిరణ్ బేడీలా పోలీస్ అధికారి కావాలనుకున్నా
- సొంతంగా ప్రిపరేషన్‌తో ఐపీఎస్ సాధించాను
- లా అండ్ ఆర్డర్ కంట్రోల్ నిత్యం సవాలే..
- సైబర్ క్రైం కట్టడిపై నా గురి
- యువత లక్ష్యాన్ని ఎంచుకుని శ్రమించాలి
- ప్రణాళిక ఉంటే విజయం తప్పక వరిస్తుంది

ఐపీఎస్ అధికారి సురుకంటి శేషాద్రినిరెడ్డి

సక్సెస్ స్టోరీ



శేషాద్రినిరెడ్డి

బి.జనార్దన్‌రెడ్డి, నల్లగొండ డెస్క్


'సమాజంలో సివిల్ సర్వెంట్లకు ఉన్నతమైన గౌరవం ఉంటుందని తెలుసుకున్నా. ఎప్పటికైనా కిరణ్‌బేడీలా పోలీస్ అధికారిని కావాలనుకున్నా. నాన్న ప్రోత్సాహంతో కల నెరవేర్చుకున్నా. యువత ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని చేరుకునేందుకు శ్రమించాలి' అని యువ ఐపీఎస్ అధికారి శేషాద్రినిరెడ్డి చెప్పారు. తెలంగాణ కేడర్‌కే కేటాయించబడిన ఆమె ప్రస్తుతం నల్లగొండలోని ఎస్పీ కార్యాలయంలో ప్రొబేషనరీ విధుల్లో ఉన్నారు. శేషాద్రినిరెడ్డి తన సక్సెస్‌పై 'సాక్షి'తో మాట్లాడారు. ఆ విశేషాలు ఇవీ..

మాది యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెం. అమ్మా, నాన్న, తమ్ముడు మా కుటుంబం. నాన్న సురుకంటి సుధాకర్‌రెడ్డి సివిల్ కాంట్రాక్టర్. నేను పుట్టింది, చదువుకుంది అంతా హైదరాబాద్‌లోనే. హైదరాబాద్ ఐఐటీలో బీటెక్ పూర్తిచేశాను. నాన్న ప్రోత్సాహంతో సివిల్స్‌పై దృష్టిపెట్టాను. సివిల్ సర్వీసెస్ ఆఫీసర్‌గా ప్రజలకు ఎంతో సేవ చేసే అవకాశం ఉంటుందని, వాళ్లకు సమాజంలో ఉన్నతమైన గౌరవం ఉంటుందని తెలుసుకుని అటువైపు అడుగులు వేశాను.

### స్వతహాగానే ప్రిపరేషన్
ఇంజనీరింగ్ పూర్తయిన వెంటనే సివిల్స్ ప్రిపరేషన్ మొదలుపెట్టాను. కోచింగ్‌కు వెళ్లకుండానే.. ఆన్‌లైన్ మెటీరియల్ చదివాను. మోడల్ పేపర్‌లను ఫాలో అయ్యాను. సీనియర్ల గైడెన్స్, మాక్ ఇంటర్వ్యూల ద్వారా అవగాహన పెంచుకున్నా. నేను ఇంజనీరింగ్ చదివినప్పటికీ సివిల్స్‌లో ఆప్షనల్‌గా తెలుగు లిటరేచర్ తీసుకున్నా. తెలుగుపై అనేక సాహిత్య, సాంస్కృతిక, చరిత్ర పుస్తకాలను చదివాను. 2019లో మొదటిసారిగా సివిల్స్ పరీక్ష రాశాను. అప్పుడు ఎంపిక కాలేదు. ఆ తర్వాత 2020 సంవత్సరంలో రెండో ప్రయత్నంలో (401) ర్యాంకు వచ్చింది. ఐపీఎస్‌కు ఎంపికయ్యాను.

### నాన్న కల నెరవేర్చాను
మా నాన్న ఎం.కాం చదివారు. అప్పట్లో గ్రూప్–1 పరీక్ష రాశారు. ఇంటర్వ్యూలో సెలక్ట్ కాలేదు. మా ద్వారా ఆయన కల నెర్చుకోవాలనుకున్నారు. చిన్నప్పటి నుంచే ఆ దిశగా నన్ను ప్రోత్సహించారు. ఐపీఎస్ కావాలని చెప్పేవారు. దేశంలోని ఉత్తమ పోలీస్ అధికారుల గురించి వివరించే వారు. కిరణ్ బేడీ గురించి తెలుసుకున్నా. ఆమే నాకు స్ఫూర్తి. ఎప్పటికైనా అలా కావాలనుకున్నా. నేను ఐపీఎస్ సాధించి నా కల నెర్చుకోవడంతో పాటు నాన్న కలను కూడా నెరవేర్చాను.

### అందరూ చీరకట్టులో..నేను చుడీదార్‌లో
సివిల్స్ ఇంటర్వ్యూ రోజున మహిళలంతా చీరకట్టులో వచ్చారు. నేను ఒక్కదాన్నే చుడీదార్‌లో వెళ్లాను. చీర ఎందుకు కట్టుకోలేదని బోర్డు సభ్యులు అడిగారు. నాకు చీర కంఫర్ట్ కాదని చెప్పాను. ఇంటర్వ్యూలో తడబడవద్దు. మనం ఏది చెప్పాలనుకుంటే అది చెప్పేయాలి. కమ్యూనికేషన్ కమాండ్ ఉండాలి. కాన్ఫిడెంట్‌గా ఉండాలి. నా సబ్జెక్టు తెలుగు కాబట్టి.. తెలుగు చరిత్రపై ఎక్కువ ప్రశ్నలు అడిగారు. కరెంట్ ఎఫైర్స్ కూడా అడిగారు.



ఐపీఎస్ శిక్షణలో శేషాద్రినిరెడ్డి (ఫైల్)

### సైబర్ క్రైం అరికట్టడంపై దృష్టిపెడతా..
ప్రస్తుతం పోలీస్ శాఖకు సైబర్ క్రైం సవాల్ విసురుతోంది. దీనిపట్ల సీనియర్ అధికారులు అమలు చేస్తున్న విధానాలు తెలుసుకుంటా. భవిష్యత్తులో మరింతగా సైబర్ నేరాలను ఎలా కట్టడి చేయాలన్న దానిపై దృష్టిపెడతా. ప్రజలకు పోలీసింగ్ మరింత చేరువ చేసేందుకు కృషిచేస్తా.

### ఇంట్లో భక్తి ఎక్కువ
అమ్మానాన్నకి భక్తి ఎక్కువ. అందుకు నాకు వేంకటేశ్వరస్వామి పేరు వచ్చేలా శేషాద్రినిరెడ్డి అని పెట్టారు. తమ్ముడి పేరు శివదుర్గారెడ్డి. వరంగల్‌లోని ఎన్ఐటీ(నిట్)లో గ్రాడ్యుయేషన్ చేస్తున్నాడు.

### థియరీకి.. ప్రాక్టికల్‌కి ఎంతో తేడా
ఐపీఎస్ శిక్షణలో నేర్చుకున్నదానికి, ప్రాక్టికల్‌గా చూస్తున్నదానికి ఎంతో తేడా ఉంది. వృత్తిపరమైన అంశాలపై ఎస్పీ అపూర్వరావు వివరంగా చెబుతున్నారు. ఎస్పీ వద్ద ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నా. డ్యూటీలో చాలా వర్క్ చేయాల్సి ఉంటుంది. మానిటరింగ్ చేయాలి. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. లా అండ్ ఆర్డర్‌పై కంట్రోల్ ఉండాలి.

### లక్ష్యాన్ని చేరుకునే వరకు శ్రమించాలి
యువత గోల్ పెట్టుకోవాలి. తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలి. దాని ప్రకారం శ్రమించాలి. గోల్ పెట్టుకోకుండా.. తమకు ఏం కావాలో నిర్ణయించుకోకుండా ముందుకు వెళితే ప్రయోజనం ఉండదు. ఒక్కసారి ఓటమిచెందితే నిరుత్సాహపడవద్దు. విజయం మన సొంతమయ్యే వరకు ప్రయత్నం చేస్తూనే ఉండాలి. సరైన మార్గనిర్దేశనం అవసరం.

## భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక.. తెలంగాణ



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

• విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట రూరల్: భిన్నత్వంలో ఏకత్వానికి తెలంగాణ రాష్ట్రం ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం సూర్యాపేట పట్టణ పరిధిలోని భాషానాయక్‌తండాలో గల ఈద్గాలో జరిగిన ప్రార్థనలకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలతో అలయ్ బలయ్ తీసుకొని వారికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి స్థానిక విలేకరులతో మాట్లాడారు. యావత్ సమాజం సుఖశాంతులతో వర్ధిల్లాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, శాంతి, మత సామరస్యాలు ఫరిడవిల్లాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. నెల రోజుల పాటుగా కఠోర దీక్షలు చేసిన ముస్లింల ప్రార్థనలకు అల్లాయే మోక్షం కలిగిస్తారన్న విశ్వాసం ఉందన్నారు. బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండుగలను అధికారికంగా నిర్వహించేది ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనేనని మంత్రి చెప్పారు. కేసీఆర్ దార్శనికతకు ఇది చక్కటి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, జెడ్పీటీసీ జీడీ భిక్షం, జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటనారాయణ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, బీఆర్ఎస్ నేత వై వి, నాయకులు రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, ఆకుల లవకుశ, సయ్యద్ సలీం, బైరు వెంకన్నగౌడ్, శనగాని రాంబాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### సుధాకర్ పీవీసీ ఆధ్వర్యంలో వాటర్ బాటిళ్ల పంపిణీ
సూర్యాపేట పట్టణ పరిధిలోని భాషానాయక్‌తండా ఈద్గా వద్దకు రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ముస్లింలు పెద్ద ఎత్తున ఈద్గా వద్దకు చేరుకున్నారు. వీరికి సుధాకర్ పీవీసీ పైపుల కంపెనీ ఆధ్వర్యంలో ఉచితంగా వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు.

## చూడముచ్చటగా ఉండాలని..


- కోదాడలో రెండు ఫ్లైఓవర్లకు కొత్తందాలు
- ఆహ్లాదం ఉట్టిపడేలా రంగులు వేయిస్తున్న మున్సిపల్ యంత్రాంగం
- రూ.50 లక్షల నిధులతో పనులు
- నెల రోజుల్లో పూర్తి చేసేలా కార్యాచరణ



కోదాడ-హుజూర్‌నగర్ రోడ్డులోని ఫ్లైఓవర్ వద్ద మొదలైన సుందరీకరణ పనులు

కోదాడ: కోదాడ పట్టణంలో మురికి పట్టిన ఫ్లైఓవర్లకు మహర్దశ పట్టింది. చెత్తరాతలు, చిత్తు కాగితాలతో కంపుకొడుతున్న వీటిని సుందరంగా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాడానికి అధికారులు పనులు మొదలు పెట్టారు. కోదాడ పట్టణ పరిధిలోని బైపాస్ (హైవే -65)పై కోదాడ-హుజూర్‌నగర్, కోదాడ-గుడిబండ వెళ్లే మార్గాల్లో ఉన్న రెండు ఫ్లైఓవర్‌ను అభివృద్ధి చేయాలని ఉన్నతాధికారులు కోదాడ మున్సిపాలిటీని ఆదేశించారు. సూర్యాపేట కొత్త బస్టాండ్ సెంటర్‌లో చేసినట్టుగా అభివృద్ధి చేయాలని చెప్పడంతో స్థానిక అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు.

### రూ.50లక్షల నిధులతో పనులు..
కోదాడ మున్సిపాలిటీకి చెందిన రు.50 లక్షల నిధులతో వీటిని అభివృద్ధి చేస్తున్నారు. రెండు చెట్ల ఫ్లైఓవర్ గోడలకు రంగుల వేయడంతో పాటు, కింద రెండు వైపులా ఉన్న గోడలకు అందమైన భారీ చిత్రాలను వేయిస్తున్నారు. దీంతో పాటు ఫ్లైఓవర్ కింద ఉన్న ఫుట్‌పాత్‌లపై పెద్దపెద్ద పూల కుండీలను పెట్టడం, ఆ ఫుట్‌పాత్‌లపై బిచ్చగాళ్లు, వ్యాపారులు ఉండకుండా అక్కడ రెయిలింగ్‌ను కూడా అమ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే రెండు ఫ్లైఓవర్ల వద్ద ఉన్న వివిధ పోస్టర్లను తొలగించి శుభ్రం చేశారు. రెండు వైపులా తెల్లటి రంగు వేశారు. ఫ్లైఓవర్ లోపల గ్రామీణ వాతావరణం తలపించేలా రంగురంగుల చిత్రాలను వేస్తున్నారు. నెల రోజుల్లో ఈ పనులన్నీ పూర్తి అవుతాయని కాంట్రాక్టర్ అంటున్నారు. అయితే గతంలో పట్టణంలోని రహదారి మధ్యలో గల డివైడర్లను రంగులతో అందంగా తీర్చిదిద్దినా వాటిపై వాల్ పోస్టర్ల అంటించారని, దీంతో డివైడర్లకు వేసిన అందమైన చిత్రాలు, రంగులు కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫ్లై ఓవర్ల పరిస్థితి కూడా డివైడర్ల మాదిరిగానే మారనుందని పట్టణ ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రూ. లక్షల ఖర్చు పెట్టి వేయిస్తున్న చిత్రాలపై పోస్టర్లు అంటించకుండా చూడాలని కోరుతున్నారు.



గుడిబండ ఫ్లైఓవర్‌కు రంగులు వేస్తున్న సిబ్బంది

### పదిరోజులుగా పనులు చేయిస్తున్నాం



కోదాడ పట్టణ పరిధిలో ఉన్న బాలాజీనగర్, గుడిబండ ఫ్లై ఓవర్లను సుందరీకరించడానికి రూ.50 లక్షల నిధులు ఖర్చు చేస్తున్నాం. పదిరోజులుగా పనులు చేయిస్తున్నాం. ఇక్కడ పనులు పూర్తయిన తరువాత ఫ్లైఓవర్ గోడలపై పోస్టర్లు వేసినా, నష్టం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటాం.

– మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్, కోదాడ

# అకాల వర్షం.. ఆగమాగం

- పదిహేడు మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం
- నేలవాలిన వరిపైరు. రాలిన మామిడికాయలు
- పలుచోట్ల తడిచిన ధాన్యం రాశులు
- పేట మార్కెట్‌లో కొట్టుకుపోయిన వడ్లు

సూర్యాపేట: అకాల వర్షం జిల్లా రైతాంగాన్ని మరోసారి ఇబ్బందుల పాలు చేసింది. శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి శనివారం తెల్లవారుజాము వరకు దాదాపు జిల్లాలో దాదాపు 17 మండలాల్లో ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం పడింది. దీంతో ఆయా మండలాల్లో వరిపైరు నేలకొరిగింది. ఇప్పటికే కోత కోసి కొనుగోలు కేంద్రాల్లో ఉంచిన ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు అమ్మకానికి రైతులు తీసుకొచ్చిన ధాన్యం వర్షానికి తడిసి కొట్టుకుపోయింది. కాంటాలు పూర్తయి ఎగుమతి కాని ధాన్యం బస్తాలు తడిచిపోయాయి. అకాల వర్షం వల్ల జరిగిన పంట నష్టం అంచనాపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. అకాల వర్షాల నేపథ్యంలో రైతాంగం ఆందోళన చెందుతోంది.



సూర్యాపేట మార్కెట్‌లో తడిసిన ధాన్యం బస్తాలు



సూర్యాపేట మార్కెట్‌లో ధాన్యం రాశుల చుట్టూ చేరిన నీళ్లు

### ఉరుకులు పరుగులు..
శుక్రవారం పగలంతా ఎండ తీవ్రత అధికంగా ఉంది. రాత్రి 10 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మెరుపులు మెరుస్తూ ఈదురు గాలులు ప్రారంభమయ్యాయి. ఈ సమయంలో ఐకేపీ సెంటర్లలో ధాన్యం పోసిన రైతులు పరుగులు తీశారు. వర్షం రాదనుకొని రాశులపై ఎలాంటి పట్టాలు కప్పుకోకుండా ఇంటికి రాగా.. ఈదురు గాలులు మొదలవడంతో పట్టాలు తీసుకొని హుటాహుటిన వెళ్లి ధాన్యం తడవకుండా కప్పారు. కొందరు రైతుల ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. కొన్ని చోట్ల ఈదురు గాలుల ధాటికి మామిడికాయలు నేలరాలాయి.



నాగారం : పస్తాలలో నెలకొరిగిన వరిపంట



ఈ ఫొటోలో వ్యక్తి పేరు కుంభం నాగయ్య. మునగాల మండలం తాడువాయి గ్రామానికి చెందిన ఈ రైతు శుక్రవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు 60 బస్తాల ధాన్యాన్ని అమ్మకానికి తీసుకొచ్చాడు. అప్పటికే టెండర్లు పూర్తి కావడంతో మరుసటి రోజు అమ్మేందుకు మార్కెట్ ఆవరణలోనే ధాన్యాన్ని ఉంచి రాత్రి అక్కడే పడుకున్నాడు. రాత్రి 10 గంటల సమయంలో కురిసిన అకాల వర్షానికి దాదాపు 30 బస్తాల వరకు ధాన్యం డ్రెయినేజీల్లోకి కొట్టుకుపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలో సగం పంట వర్షార్పణం అయిందని.. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి తనను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

### సరాసరి 8.7 మిల్లీమీటర్ల వర్షపాతం
జిల్లాలోని దాదాపు 17 మండలాల్లో మోస్తరు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి 8.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. తుంగతుర్తి మండలంలో 38.7 మి.మీ., నూతనకల్‌లో 30.9, మద్దిరాలలో 27.0, నాగారంలో 24.2, ఆత్మకూర్ ఎస్ లో 17.8, పెన్‌పహాడ్ లో 13.8, నడిగూడెంలో 10.4, మోతెలో 9.9, చివ్వెంలలో 6.4, జాజిరెడ్డిగూడెంలో 5.0, కోదాడలో 5.0, మునగాలలో 3.2, నేరేడుచర్లలో 2.3, తిరుమలగిరి, చిలు కూరు మండలాల్లో 1.8, సూర్యాపేట, అనంతగిరి మండలాల్లో 1.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

### రైతులకు భరోసా కల్పించాలి
• మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట: అకాల వర్షాలతో రైతులు అధైర్య పడకుండా భరోసా కల్పించాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న అకాల వర్షాల నేపథ్యంలో కలెక్టర్ వెంకట్రావుతో మంత్రి జగదీశ్‌రెడ్డి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పలు సూచనలు చేస్తున్నారు. దీంతో శనివారం నుంచి రంగంలోకి దిగిన కలెక్టర్.. అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, అధికారులను కొనుగోలు కేంద్రాలకు చేరుకుని పరిస్థితిని తెలుసుకొని రైతులకు భరోసా కల్పిస్తున్నారు.



మద్దిరాల : గోరెంట్ల కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పోగు చేస్తున్న మహిళ

## క్లుప్తంగా

### గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలోని రామలింగాలగూడెం కాటన్ మిల్లు సమీపంలో రోడ్డు పక్కన శనివారం ఓ వ్యక్తి మృతదేహం లభించింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రాఘవరావు, ఎస్ఐ వాస ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని నల్లగొండ మార్చురీకి తరలించారు.మృతుడికి 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ పేర్కొన్నారు. అనారోగ్య కారణాలతో మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ఆచార్య రవ్వా శ్రీహరి మృతికి సంతాపం

రామగిరి(నల్లగొండ): ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ప్రముఖ సాహితీ వేత్త ఆచార్య రవ్వా శ్రీహరి అకాల మృతికి జిల్లా రచయిత సంఘం అధ్యక్షుడు మేరెడ్డి యాదగిరిరెడ్డి, సాహితీ మేఖల సంస్థ ప్రధాన కార్యదర్శి పున్న అంజయ్య శనివారం సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిఘంటు నిర్మాత, సంస్కృత పండితులు, ద్రావిడ విశ్వ విద్యాలయ పూర్వ ఉపకులపతిగా ఆచార్య రవ్వా శ్రీహరి పని చేసినట్లు పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా మాండలిక పదకోశం అనే నిఘంటువును నిర్మించి తెలుగు సాహిత్య రంగానికి బాటలు వేశారన్నారు.

### ఒడిశా వలస కార్మికులకు విముక్తి

నకిరేకల్ : ఇటుక బట్టీలలో పనిచేస్తున్న ఒడిశా వలస కార్మికులకు పోలీసులు, కార్మిక శాఖ అధికారులు విముక్తి కల్పించారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సీఐడీ చీఫ్ మహేష్ ఎం భగవత్ ఆదేశాల మేరకు సీఐడీ డీఎస్పీ ఎర్నా, ఇన్‌స్పెక్టర్‌లు చెరుకు నాగరాజు,రమేశ్‌ల ఆధ్వర్యంలో శనివారం నకిరేకల్ మండలం చందుపట్ల లోని ఎస్ఎస్ఆర్ ఇటుక బట్టీలపై దాడులు చేశారు. అక్కడ ఏడుగురు పరుషులు, ఆరుగురు మహిళలు, నలుగురు బాల బాలికలు పనిచేస్తున్నట్లు గుర్తించారు. యజమాన్యం వారికి వేతనం ఇవ్వకుండా, నిర్బంధించి పనులు చేయించుకుంటున్నారని తేలింది. ఈ సమాచారం ఆ రాష్ట్రాల లేబర్ వారికి సమాచారం అందడంతో తెలంగాణ సీఐడీ చీఫ్ మహేష్ భగవత్ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు దాడులు చేశారు. సంబంధిత యాజమాన్యంతో మాట్లాడి వారికి రావాల్సిన వేతనాలను ఇప్పించారు. వారు సొంత రాష్ట్రానికి వేళ్లేందుకు అయ్యే ఖర్చులు, భోజన ఖర్చులను కూడా ఇప్పించారు. ప్రత్యేక వాహనంలో వారిని నల్లగొండ రైల్వే స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి ఒడిశాకు పంపించారు.

# కూలిన చెట్లు.. తడిసిన ధాన్యం



కట్టంగూరు మండలం గంగదేవిగూడెంలో నెలకొరిగిన నిమ్మచెట్లను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి రావుల విద్యాసాగర్



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం బస్తాలు

- అకాల వర్షానికి మార్కెట్‌లలో కొట్టుకుపోయిన ధాన్యం రాశులు
- ఈదురుగాలులకు నేలరాలిన మామిడికాయలు
- పలు చోట్ల విరిగిన విద్యుత్ స్తంభాలు
- మూగజీవాల మృత్యువాత
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం



చౌటుప్పల్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని ఆరబోసుకుంటున్న రైతు

కట్టంగూర్ : అకాల వర్షం రైతాంగాన్ని మరోసారి ఇబ్బందుల పాలు చేసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు ఉమ్మడి జిల్లాలో ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం పడింది. దీంతో ఆయా మండలాల్లో వరిపైరు నేలకొరిగింది. ఇప్పటికే కోత కోసి కొనుగోలు కేంద్రాల్లో ఉంచిన ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. కట్టంగూరు మండలంలో కురిసిన వర్షం రైతులను కన్నీరు పెట్టించింది. ఐకేపీ కేంద్రంలో నిలువ ఉంచిన ధాన్యం రాశుల కిందుగా నీరు ప్రవహించటంతో తడిసి కొట్టుకుపోయాయి. కేంద్రాల్లో పట్టాలు పంపిణీ సక్రమంగా లేకపోవటంతో ధాన్యం తడిసింది. ముందుస్తుగానే కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయకపోవటం వల్ల తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు పేర్కొన్నారు. మండలంలోని చెర్వుఅన్నారం, అయిటిపాముల, కట్టంగూర్, కురుమర్తి, పరడ, నారెగూడెం, మునుకుంట్ల ధాన్యం కేంద్రాల్లో సుమారు 145 ధాన్యం రాశులు( 3280 క్వింటాళ్లు) తడిసి ముద్దయ్యాయి. తూకం వేసిన బస్తాలు 5481( 2192 క్వింటాలు) తడిసి ముద్దయ్యాని తహసీల్దార్ దేశ్యానాయక్ తెలిపారు. అదే విదంగా మండలంలోని గంగదేవిగూడెం, అయిటిపాములతో పాటు పలుగ్రామాల్లో అకాల వర్షానికి ఈదురుగాలులకు నిమ్మచెట్లు నేలకొరిగి, మామిడి చెట్లు దెబ్బతిన్నాయి. నేలకొరిగిన నిమ్మ, మామిడిచెట్లను నకిరేకల్ హార్టికల్చర్ అధికారి రావుల విద్యాసాగర్ పరిశీలించారు. కొమ్మలు విరిగి మామిడికాయలు రాలటంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అయిటిపాములకు చెందిన రైతు అనంతుల రమేష్‌కు చెందిన 100 మామడిచెట్ల కొమ్మలు ఈదురుగాలులకు విరిగి కాయలు రాలి తీవ్రంగా నష్టపోయాడు.

**మాడుగులపల్లిలో..**

మాడుగులపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం తెల్లవారుజామున ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పాములపాడులో ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంలో పిడుగుపడడంతో ఆవు మృతి చెందింది. ఐకేపీ కేంద్రంలో ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఇసుకబాయిగూడెంలో హైమాస్ట్ లైట్ల స్తంభం విరిగిపడింది. వేములపల్లి-ఇసుకబాయిగూడెం రోడ్డు వెంట చెట్ల కొమ్మలు నేల కూలాయి. కన్నెకల్లు, ధర్మపురం గ్రామాల్లో ఉద్యాన పంటలకు స్వల్ప నష్టం వాటిల్లింది. మాచినపల్లి గ్రామంలో మూడు చోట్ల పిడుగులు పడినట్లు గ్రామస్తులు తెలిపారు. చాలా గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగి సరఫరాకు అంతరాయం కలగడంతో అంధకారం నెలకొంది.

**వేములపల్లిలో..**

వేములపల్లి : రైతులు ఆరుగాలం శ్రమించి సాగు చేసి ఐకేపీ కేంద్రాలకు తరలించిన ధాన్యం శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసి ముద్దయింది. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేగవంతం చేయకపోవడంతో కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసిపోయిందని ఆవేద వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలను వేగవంతం చేసి ఆదుకోవాలన్నారు.

**దండుమల్కాపురంలో 20గొర్రెలు మృతి**

చౌటుప్పల్ : గత రాత్రి కురిసిన అకాల వర్షానికి మండలంలో అంతా ఆగమాగం అయ్యింది. మండల పరిధిలోని ఎస్.లింగోటం గ్రామంలో ఉప్పు వెంకటేశంకు చెందిన కోళ్లఫారం గోడ కూలింది. ఫాంలోని మూడు వందల బ్రాయిలర్ కోళ్లు చనిపోయాయి. సుమారుగా 3లక్షల వరకు నష్టం జరిగిందని రైతు తెలిపాడు. మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలో పిల్లి రాజుయాదవ్‌కు చెందిన గొర్రెల షెడ్డు ప్రహరీ ఈదురుగాలులకు కూలింది. దీంతో 20గొర్రెలు మృతిచెందగా, 4గొర్రెలు, 2మేకలు ప్రాణాపాయస్థితిలో ఉన్నాయి. మరో 20గొర్రెలకు గాయాలయ్యాయి. యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండెబోయిన అయోధ్యయాదవ్ రైతును పరామర్శించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్ గొర్రెలు వైద్యం అందించారు. పలు గ్రామాల్లోని మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి.

**రామన్నపేటలో..**

రామన్నపేట : మండలవ్యాప్తంగా శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి రైతులు తీవ్రంగా నష్టపోయాయి. బలమైన ఈదరుగాలులలో కూడిన వర్షానికి చెట్లు నేలకొరిగాయి. విద్యుత్‌స్తంభాలు నేలకొరిగి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొనుగోలు కేంద్రాలలో పోసిన ధాన్యం తడిసింది. వరదలకు ధాన్యం కొట్టుకుపోగా, ఆరబెట్టిన రాశుల కిందికి నీరు చేరింది. కొట్టుకుపోయిన ధాన్యంను ఎత్తడానికి, తడిసిన ధాన్యంను అరబెట్టడానికి రైతులు ఇంటిల్లిపాది శ్రమించవలసి వచ్చింది. మామిడికాయలు నేలరాలాయి. రామన్నపేటలో కౌలు రైతు రవి సాగుచేసిన బొప్పాయితోట సగానికి పైగా నేలకొరిగింది. కోతకు సిద్ధంగా ఉన్నటువంటి వరిచేలలో గింజలు నేల రాలాయి. మండలకేంద్రంలోని ప్రధానవీధులు చెట్ల ఆకులు కొమ్మలతో నిండిపోయాయి. వీధులను శుభ్రం చేయడానికి పంచాయతీ కార్మికులు తీవ్రంగా శ్రమించారు.

**గట్టుప్పలలో..**

చండూరు( గట్టుప్పల) : గట్టుప్పల మండలం పరిధిలోని శేరిగూడెం,తేరట్‌పల్లి గ్రామ శివారులో వరి చేలు ధ్వంసమయ్యాయి. చేతికి వచ్చిన వరి పంటలు కోసేందుకు యంత్రాల ఆలస్యంతో రైతులు నిండా మునిగారు. తేరట్‌పల్లిలో జంగయ్యకు చెందిన ఈదురు గాలులకు గోడ కూలి బర్రె , దూడకు తీవ్ర గాయాలయ్యాయి.

**పొలాలను పరిశీలించిన తహసీల్దార్**

ఈదురు గాలులు..అకాల వర్షానికి నష్టం జరిగిన పంట పొలాలను తహసీల్దారు దేవుల పల్లి వెంకటేశ్వర్లు , ఏఈఓ నాగార్జునలు తేరట్‌పల్లి, శేరిగూడెం గ్రామాల్లో పరిశీలించారు. రెండు గ్రామాల్లో సుమారుగా 190 నుంచి 200 ఎకరాల వరకు పంట నష్టం జరిగిందని అధికారులకు నివేదిక ఇస్తున్నట్లు తెలిసింది.

**రాజాపేటలో..**

రాజాపేట : మండలంలోని కుర్రారం, బొందుగుల, పారుపల్లి, బూర్గుపల్లి, జాల తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలలతో కూడిన వడగండ్ల వర్షానికి మామిడి కాయలు నేలరాలాయి. వరిపంట నేలకొరిగింది. కుర్రారం గ్రామంలో ఏకంగా 22 ఎకరాల్లో మామిడి కాయలు నేల రాలాయని రైతు పెంటపర్తి రాజిరెడ్డి, మాద వరెడ్డిలు ఆవేదన వ్యక్తం చేశారు.



తేరట్‌పల్లిలో విరిగిన వేప చెట్టు



రామన్నపేట మార్కెట్‌లో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు



మాడ్గులపల్లి మండలం ఇసుకబావిగూడెంలో విరిగిన స్తంభం



గట్టుప్పల: శేరిగూడెంలో పంటను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏఈఓ నాగార్జున



దండుమల్కాపురం గ్రామంలో ప్రహరీ కూలడంతో చనిపోయిన గొర్రెలు



చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం గ్రామంలో గోడ కూలి చనిపోయిన కోళ్లు



శేరిగూడెంలో రాలిన వడ్లు



గంగదేవిగూడెంలో ఈదురుగాలులకు రాలిన మామిడి కాయలు



అయిటిపాముల ఐకేపీ కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం



సూర్యాపేట మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

## నారాయణపురంలో భగ్గుమన్న వర్గ విభేదాలు

- అధికార, విపక్ష సభ్యుల పరస్పర దాడి
- పోలీసులకు ఫిర్యాదు చేసుకున్న ఇరువర్గాలు

చిలుకూరు: చిలుకూరు మండలంలోని నారాయణపురంలో వర్గవిభేదాలు భయటపడ్డాయి. అధికార విపక్ష పార్టీల సభ్యులు ఒకరిపై ఒకరు దాడి చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. విశ్వసనీయ వర్గాల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపురం గ్రామానికి చెందిన పలువురు మహిళలు తమ వార్డులో మంచినీళ్లు రావడం లేదని సర్పంచ్ తమ్మనబోయిన శంకర్ ఇంటి వద్దకు వెళ్లి సమస్యను తెలియజేశారు. సర్పంచ్ వారితో మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేసేందుకు వార్డు సభ్యులు సహకరించడం లేదని, తీర్మానాలు చేయకుండా పనులు చేపట్టలేమని తెలిపాడు. దీంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొండి ప్రభాకర్ తనను ఉద్దేశించి ఏదో అంటున్నావు అంటూ సర్పంచ్‌పై దాడి దిగాడు. దీంతో కొద్ది సేపు ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అనంతరం సర్పంచ్ తమ్మనబోయిన శంకర్ జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ప్రభాకర్‌కు ఫోన్ చేసి స్టేషన్‌కు రావాలని కోరగా వెళ్తున్న క్రమంలో సర్పంచ్ వర్గీయులు తహసీల్దార్ కార్యాలయం వద్ద అతడిపై దాడి చేశారు. అనంతరం ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నట్లు తెలిసింది.

## అదృశ్యమైన వ్యక్తి మృతి

మేళ్లచెరువు : అదృశ్యమైన వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మేళ్లచెర్వులో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. చింతలపాలెం గ్రామానికి చెందిన గొంగిరెడ్డి భిక్షమ్మరెడ్డి (50) ఈ నెల 5వ తేదీన ఇంటి నుండి వెళ్లిపోయినట్లు స్థానిక పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. కాగా, మండలకేంద్రంలో పరిధిలోని చింతలపాలెం రోడ్డు జోగు కుంట పరిధిలో కుళ్లిపోయిన మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతుడు భిక్షమ్మరెడ్డిగా గుర్తించారు. అతడు చనిపోయి పక్షం రోజులు కావడంతో మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి కుమారుడు మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఆనంద్ నాయక్ తెలిపారు.

## మహబూబ్‌నగర్ ఎస్పీకి మంత్రి పరామర్శ



మారయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

చండూరు : మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహగౌడ్ తండ్రి మారయ్య (75) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని శనివారం ఎ క్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఎస్పీ స్వగ్రామమైన చండూరు మండలం కొండాపురం గ్రామంలో పరామర్శించారు. ఆయన వెంట చండూరు గౌడ సంఘం అధ్యక్షుడు భీమనపల్లి శేఖర్, వడ్డే పల్లిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మూడు ఇసుక లారీల పట్టివేత

కేతేపల్లి: హైదరాబాద్‌కు ఇసుకను తరలిస్తున్న మూడు లారీలను శనివారం పట్టుకుని కేసు నమోదు చేశామని కేతేపల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రా ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు ఇసుకను తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో తెల్లవారుజామున కేతేపల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి, సిబ్బందిలో కలసి హైవేపై కొర్లపహాడ్ శివారులో గల టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ నుంచి హైదరాబాద్‌కు ఇసుకను తరలిస్తున్న మూడు లారీలను పోలీసులు పట్టుకున్నారు. ఇసుక రవాణాకు సంబంధించి డ్రైవర్ల వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవటతో లారీలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న లారీల యజమానులు వంగూరి వెంకటయ్య, గాజుల లింగయ్య, తాళ్ళ నరేందర్‌రెడ్డిలతో పాటు ఆయా వాహనాల డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అనిల్ రెడ్డి పేర్కొన్నారు.

## మంత్రాలు చేశారంటూ దూషించిన వ్యక్తిపై దాడి

గుర్రంపోడు : మంత్రాల కారణంగా తన భార్య చనిపోయిందంటూ దూషించిన వ్యక్తిని మహిళలు చెట్టుకు కట్టేసి కొట్టారు. ఈ ఘటన మండలంలోని కొత్తలాపురం గ్రామంలో జరిగింది. ఎస్ఐ శివప్రసాద్ తెల్పిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తలాపురం గ్రామానికి చెందిన చామకూరి సత్తయ్య భార్య చనిపోగా రెండో భార్య ఇతనితో ఘర్షణ పడి వెళ్లిపోయింది. సత్తయ్య 9వ తరగతి చదువుతున్న కుమారుడితో కలిసి ఉంటున్నాడు. తన భార్యకు మంత్రాలు చేశారంటూ గ్రామానికి చెందిన చామకూరి చంద్రమౌళిని కొంతకాలంగా దూషిస్తున్నాడు. ఇదే క్రమంలో ఆదివారం రాత్రి చంద్రమౌళి ఇంట్లో ప్రవేశించి కుటుంబ సభ్యులను దూషించాడు. ఉదయమే చంద్రమౌళి , ఇతని కుమారుడు రఘు, కోడలు కవిత, మరికొంత మహిళలు ఇతనిని పట్టుకుని స్తంభానికి కట్టేసి దాడి చేశారు. చంద్రమౌళి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సత్తయ్యపై కేసు నమోదు చేశామన్నారు. సత్తయ్యపై జరిగిన దాడి విషయంలోనూ విచారణ జరిపి తగు చర్య తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

## పిడుగుపాటుతో రెండు గేదెలు మృతి

శాలిగౌరారం: వేర్వేరు చోట్ల పిడుగుపాటుతో రెండు గేదెలు మృతిచెందాయి. శాలిగౌరారం ,తిప్పర్తి మండలా పరిధిలో చోటు చేసుకున్న ఈఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. శాలిగౌరారం మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన వేముల అశోక్ తన ఇంటి సమీపంలో ఉన్న పశువులకొట్టంలో చెట్టుకు గేదెను కట్టేసి ఉంచాడు. రాత్రి అకాలంగా ఈదురుగాలులు, ఉరుములతో పాటు చెట్టుపై పిడుగు పడటంతో గేదె అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన గేదె విలువ రూ. 50 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

**జంగారెడ్డిగూడెంలో..**

రామగిరి(నల్లగొండ): మండలంలోని జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన తండు సత్తయ్యకు చెందిన గేదే ఇంటి ముందు ఉన్న వేప చెట్టుకు కట్టేశారు. శుక్రవారం రాత్రి వేప చెట్టు వద్ద పిడుగు పడడంతో చెట్టు కింద ఉన్న గేదె మృతిచెందింది.

## దైవ దర్శనానికి వెళ్తూ మృత్యుఒడికి

- రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

కట్టంగూర్ : దైవ దర్శనానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామశివారు 65వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల టౌన్‌కు చెందిన దుస్స విఘ్నేష్(20) తన స్నేహితుడు పెద్ది సుమంత్‌తో కలిసి కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునేందుకు శుక్రవారం అర్ధరాత్రి హైదరాబాదు నుంచి టాక్సీలో బయలుదేరారు.మార్గమధ్యలో అయిటిపాముల గ్రామశివారులో గల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే కారు డ్రైవర్ రాజ్‌కళ్యాణ్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ముందున్న లారీని వెనకనుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు ముందు సీట్లో ఎడమవైపు కూర్చున్న విఘ్నేష్ తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రున్ని తన స్నేహితుడు నకిరేకల్ ప్రభుత్వ తీసుకెళ్లాడు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి బాబాయ్ బరిగెల జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

**బోర్‌వెల్ వాహనాన్ని ఢీకొని..**

దేవరకొండ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటన శనివారం దేవరకొండ మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డిండి మండల పరిధిలోని గోనబోయినపల్లి గ్రామానికి చెందిన కుమార్(21) దేవరకొండలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూనే పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన బంధువు రాఘవులుతో కలిసి శనివారం స్వగ్రామమైన గోనబోయినపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై వాహన రిజిస్ట్రేషన్ నిమిత్తం దేవరకొండ మీదుగా హైదరాబాద్‌కు బయల్దేరారు.ఈ క్రమంలో దేవరకొండ మండల పరిధిలోని మైనంపల్లి సమీపంలోకి రాగానే దేవరకొండ నుంచి డిండి వైపు వెళ్తున్న బోర్‌వెల్ వాహనాన్ని ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న కుమార్, రాఘవులుకు తీవ్ర గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న దేవరకొండ ఇన్‌చార్జ్ సీఐ శ్రీనివాస్‌తో పాటు ఎస్ఐ సతీష్‌లు 108 వాహనంలో క్షతగాత్రులను దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే కుమార్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.గాయాలపాలైన రాఘవులును హైదరాబాద్‌కు తరలించారు.ఈ మేరకు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

## వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి



వీరయ్య(ఫైల్)

అర్వపల్లి: వ్యవసాయ బావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన జాజిరెడ్డిగూడెం మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన జీడి పెద్దవీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పీరయ్య దశదినకర్మ శనివారం కాగా స్నానాల కోసం బంధువులు అంతా కలిసి గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. ఈక్రమంలోనే పీరయ్యకు వరుసకు మనుమడైన జీడి వీరయ్య(35) స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. అయితే బావిలో దిగిన వారి అందరి స్నానాలు అయిపోయాక తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో వీరయ్య చెప్పులు, దుస్తులు బావి ఒడ్డున ఉన్నాయి. వీటిని చూసి బంధువులు వీరయ్య కోసం వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి తాళ్లతో బావిలో వెతికించారు. అప్పటికే వీరయ్య మరణించాడు. వీరయ్య మృతదేహాన్ని తాళ్ల సాయంతో బయటకు తీయించారు. ఈ సంఘటనతో గ్రామ ఎస్సీకాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య మల్లమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజిరెడ్డి తెలిపారు. కాగా సంఘటన విషయం తెలిసిన వెంటనే సూర్యాపేట జడ్పీటీసీ జీడి భిక్షం, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి కుటుంబీకులను పరామర్శించారు.

## సంతలో సెల్‌ఫోన్ చోరీ

కట్టంగూర్ : కట్టంగూర్ కూరగాయల సంతలో శనివారం సెల్‌ఫోన్ చోరీకి గురైంది. మండలకేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన మేడి మహేష్ వారసంత కావటంతో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చాడు. అండర్‌పాసింగ్ సమీపంలో కూరగాయలు కొనుగోలు చేస్తుండగా పాయింట్ జేబులో ఉన్న తన సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయాడు. ఇంటికి వెళుతూ జేబును చెక్‌చేసుకోగా సెల్‌ఫోన్ కనబడలేదు. వెంటనే వేరే మొబైల్‌తో ఫోన్‌చేయగా స్విచ్‌ఆఫ్ చేసి ఉందని బాధితుడు తెలిపాడు. నెలరోజుల క్రితమే 5జీ నెట్‌వర్క్‌తో కూడిన రూ.22వేల విలువగల సెల్‌ఫోన్ కొన్నానని తెలిపాడు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

## క్లుప్తంగా

### చలివేంద్రం ప్రారంభం



రామన్నగూడెంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దాత మధు

అర్వపల్లి : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దాత దోరపల్లి మధు కోరారు. శనివారం రామన్నగూడెంలో హైవే వెంట సివిల్ సప్లయ్ రిటైర్డ్ అధికారి దివంగత దోరపల్లి అర్వపల్లి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మధు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చలివేంద్రం దాత మధును పలువురు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రమావత్ భీముడు, కంచర్ల పాండు, తవిటి సైదులు, తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు, పి. జానయ్య, వీరమల్లు, అంజయ్య, పి.నర్సింహ, జూలూరి వెంకన్న, వంగూరి నరేష్, బి. నాగార్జున, శ్రీరాముల సంపత్, జడ గణేష్, గుగ్గిళ్ల నాగయ్య, ఈద సైదులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మన్‌గా మహ్మద్ హఫీజ్



తిరుమలగిరి : తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ చైర్మన్‌గా తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన మహ్మద్ హఫీజ్‌ను నియమించినట్లు సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా హఫీజ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ నిజాముద్దీన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.


### జన్నపాల ఎల్లయ్య సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి : మాదిగ జాతికి, ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి జన్నపాల ఎల్లయ్య చేసిన సేవలు మరువలేనివని ఎమ్మార్పీఎస్ నాయకులు యాతాకుల రాజన్న, చింతలపాటి చిన్న శ్రీరాములు అన్నారు. శనివారం పట్టణంలోని రాజీవ్ నగర్‌లోగల ఎల్లయ్య నివాసంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. అనంతరం వారికి రూ.20 వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనుకుంట్ల వెంకన్న, ఎర్ర వీరస్వామి, బోడ శ్రీరాములు, మామిడి అంజయ్య, ములకలపల్లి మల్లేష్, కోడి వెంకటయ్య, ములకలపల్లి రవి, ఈద ప్రవీణ్, వెంకన్న, కనకయ్య, మల్లేష్, అంజయ్య, వెంకన్న, రమేష్, రవి, సతీష్, వినయ్, రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### సమావేశాలు, ర్యాలీలకు అనుమతి తీసుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న కోదాడ రూరల్ సీఐ

అనంతగిరి : అనుమతులు లేకుండా సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తే చర్యలు తప్పవని కోదాడ రూరల్ సీఐ నాగదుర్గాప్రసాద్ అన్నారు. శనివారం అనంతగిరి పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పాలేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు వేసవిలో ఆరుబయట నిద్రించేటప్పుడు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు రహదారులపై ధాన్యం ఆరబోయొద్దని, కాదని ఆరబోసి ప్రయాణికుల ప్రమాదాలకు కారణమైతే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ అయిలయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### కారు, బైక్ ఢీ.. వ్యక్తికి గాయాలు

నాగారం : సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై ఈటూరు ఆవాసం ప్రగతినగర్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రికొత్తగూడెం జిల్లాకు చెందిన అంగోతు హరీష్ బైక్‌పై తిరుమలగిరి నుంచి నాగారం వైపు వస్తున్నాడు. నాగారం మండలం ప్రగతినగర్ వద్ద సూర్యాపేట నుంచి వరంగల్ వైపువెళుతున్న కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న హరీష్‌కు తీవ్ర గాయాలైనాయి. చికిత్స నిమిత్తం అతడిని సూర్యాపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

# భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని గ్రామాల్లో రంజాన్ వేడుకలను ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో ముస్లింలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సూర్యాపేటలో ఈద్గా వద్ద ప్రార్థనల్లో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల



సూర్యాపేటలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సూర్యాపేటలో మంత్రి జగదీశ్‌రెడ్డికి సేమియా తినిపిస్తున్న ముస్లిం యువకుడు



నాగారం : ఫణిగిరిలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్‌లో..



ఆత్మకూర్ (ఎస్) : ఏపూరులో..



సూర్యాపేటలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని



దురాజ్‌పల్లి : సూర్యాపేటలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాగార్జున్‌రెడ్డి



సూర్యాపేట రూరల్ : కేటీఅన్నారంలో వేడుకల్లో పాల్గొన్న జెడ్పీటీసీ భిక్షం, ప్రజాప్రతినిధులు



తిరుమలగిరిలో ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు



అర్వపల్లిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



నాగారంలోని ఈద్గాలో..



సూర్యాపేట : భాషానాయక్ తండాలో వాటర్‌బాటిళ్లను పంపిణీ చేస్తున్న పీవీసీ సిబ్బంది



పెన్‌పహాడ్‌లో..

### ఆన్‌లైన్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఆన్‌లైన్ శిక్షణ ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్ : అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ ఆన్‌లైన్ కోచింగ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పాలిటెక్నిక్ ఆన్‌లైన్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులను వినియోగించుకొని పోటీ పరీక్షల్లోనూ రాణించాలని పేర్కొన్నారు. ఉచితంగా ఆన్‌లైన్ తరగతులను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్‌రెడ్డి, నాగయ్య, వెంకన్న, జనార్దనాచారి, దామోదర్‌రెడ్డి, కాళిదాసు, తిరుమల్‌రెడ్డి, వీరాసింగ్, హనుమాచారి, శంకర్‌రెడ్డి, యూసుఫ్, ఉపేందర్, చంద్రబోస్, అప్పారావు, ఉపేంద్రాచారి పాల్గొన్నారు.

### నేడు టీజోలా చెస్ ఛాంపియన్ షిప్

సూర్యాపేట టౌన్ : సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ సహకారంతో పట్టణంలోని జనగామ క్రాస్ రోడ్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో ఆదివారం టీజోలా చెస్ ఛాంపియన్ షిప్ 2023 నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గండూరి కృపాకర్, ఎల్.సతీష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలు తెలిపారు. అండర్ 15 బాల బాలికలు ఉదయం 10 గంటలలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం.. ఈ నెల 26న హైదరాబాద్‌లో జరిగే ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌కు పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవం

దురాజ్‌పల్లి : సీపీఐ (ఎంఎల్) 54వ ఆవిర్భావ దినోత్సవం, లెనిన్ జయంతి వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, పీవైఎల్ జిల్లా కార్యదర్శి కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, నాయకులు కారింగుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

**విప్లవోద్యమ నిర్మాణ దినంగా జరపాలి**

ఏటా ఏప్రిల్ 22న లెనిన్ జయంతిని విప్లవోద్యమ నిర్మాణ దినంగా జరపాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం లెనిన్ 153వ జయంతి సందర్భంగా ప్రజాపంథా జిల్లా కార్యాలయంలో జెండా ఆవిష్కరించి, లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక, జిల్లా నాయకులు గొడ్డలి నర్సయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా రాంజీ, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు చంద్రకళ, ఉపాధ్యక్షులు సూరం రేణుక, సహాయ కార్యదర్శి సంతోషిమాతా, కోశాధికారి జయమ్మ పాల్గొన్నారు.



దురాజ్‌పల్లి : జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : సీపీఐ ఎంఎల్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం, లెనిన్ 153వ జయంతి వేడుకలను మండల వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎంఎల్ పార్టీ నాయకులు పార్టీ జెండా ఆవిష్కరించారు. లెనిన్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు దేగల వెంకటకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ నాగయ్య, భానుప్రసాద్, గునగంటి శ్రీను, చిత్తలూరి కృష్ణ, పిట్టల లింగయ్య, కంచర్ల నర్సక్క, సంఘం వీరయ్య, ఎల్లుట్ల ఉపేందర్, బోయిన నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



దురాజ్‌పల్లి : జెండా ఆవిష్కరించి, లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఆత్మకూరులో జెండా ఆవిష్కరిస్తున్న వెంకటకృష్ణ

### పులిహోర పంపిణీ

దురాజ్‌పల్లి : జిల్లా కేంద్రంలోని కోర్టు సమీపంలో సినీ హీరో సుమన్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద శనివారం ప్రజలకు ఉచితంగా పులిహోర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండా వెంకన్న ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సుమన్ ఫ్యాన్స్ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు పాల్గొన్నారు.

### 25న జెండా పండుగ

పెన్‌పహాడ్ : బీఆర్ఎస్ జెండా పండుగను ఈ నెల 25న అన్ని గ్రామాల్లో నిర్వహించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్ అన్నారు. శనివారం అనంతారంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు మామిడి అంజయ్య, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కట్ల నాగార్జున పాల్గొన్నారు.

### మృతుల కుటుంబానికి పరామర్శ

మద్దిరాల : ఇటీవల హైదరాబాద్‌లోని కుషా యిగూడలో జరిగిన అగ్నిప్రమాదంలో రెడ్డిగూడెం గ్రామానికి చెందిన రేట్నేని జన్నయ్య కుమారుడు రేట్నేని నరేష్, కోడలు సుమ, చిన్న మనుమడు జస్విత్‌లు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఎండీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవి పటేల్ శనివారం రెడ్డిగూడెం గ్రామంలో మృతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం

- ఈనెలాఖరు వరకు గడువు
- ఇప్పటికే జాజిరెడ్డిగూడెం మండలంలో 21,650 మంది ఓటర్లు
- ఈ ఏడాదిలో కొత్తగా 153 దరఖాస్తులు

అర్వపల్లి : 18 ఏళ్లు నిండిన వారు కొత్త ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం మరోసారి వచ్చింది. ఏడాదిలో నాలుగుసార్లు దరఖాస్తులు చేసుకోవాలని ఎన్నికల సంఘం నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఏటా జనవరి, ఏప్రిల్, జూన్, అక్టోబర్‌లో కొత్త ఓటర్ల నమోదుతోపాటు మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియ కొనసాగుతుంది. అయితే ఇప్పటికే ఈఏడాది జనవరిలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండో విడుతలో ఈనెలాఖరు వరకు కొత్త ఓటరు నమోదు ప్రక్రియ జరగనుంది. అలాగే జూన్, అక్టోబర్ నెల్లో కూడా 18ఏళ్లు నిండిన వారు కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఓటరు నమోదుకు ఫారం-6, తొలగింపులకు ఫారం-7, సవరణలకు ఫారం-8లో దరఖాస్తు చేయాలి.



అర్వపల్లిలో ఓటరు నమోదు ప్రత్యేక శిబిరం (ఫైల్)

**మండలంలో ఇలా..**

జాజిరెడ్డిగూడెం మండలంలో 31 పోలింగ్ కేంద్రాలు ఉండగా 21,650 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 10,901 మంది పురుషులు, 10,749 మంది స్త్రీలు. కాగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 18 ఏళ్లు నిండిన వారు 153 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం 18ఏళ్లు నిండిన వారు ఉంటే ఈనెలాఖరు వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

**ఓటే వజ్రాయుధం**



ఓటు వజ్రాయుధం లాంటిది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి. దేశ భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటర్లే. ఓటు హక్కు ద్వారా పేదలందరికి న్యాయం జరిగేలా మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి.

– దడిపల్లి వెంకట్, సామాజిక కార్యకర్త

**దరఖాస్తు చేసుకోవాలి**



18ఏళ్లు నిండిన వారు కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఈనెలాఖరు వరకు అవకాశం ఉంది. అలాగే మార్పులు, చేర్పులు, తొలగింపు ప్రక్రియ కూడా ఉంటుంది. మండలంలో 21,650 మంది ఓటర్లు ఉండగా జనవరి నుంచి ఇప్పటి వరకు 153 మంది కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారు.

– పి.యాదగిరిరెడ్డి, తహసీల్దార్

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

మద్దిరాల : కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ డిమాండ్ చేశారు. గోరెంట్లలోని కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, సంగని విద్యాసాగర్, రాజు, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**నష్టపోయిన రైతులను ఆదుకోవాలి**

అర్వపల్లి : అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఎంసీపీఐయూ డివిజన్ ఇన్‌చార్జ్ ఈదురు వీరపాపయ్య కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈదురుగాలులు, మెరుపులు, ఉరుములతో కూడిన అకాల వర్షంతో రైతులు పంటతోపాటు కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి నష్టపోయారని చెప్పారు. అలాగే మామిడి, నిమ్మ రైతులు కూడా నష్టపోయారని తెలిపారు.

**తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన తహసీల్దార్**

నాగారం : మండలంలో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురియడంతో తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్ శనివారం వర్ధమానుకోట, ఈటూరు, ఫణిగిరి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందొద్దని సూచించారు. ఆయనతో పాటు ఆర్‌ఐలు లక్ష్మీనర్సింహారావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు



ఉండ్రుగొండలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న గ్రీన్‌క్లబ్ సభ్యులు

చివ్వెంల : ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లుతుందని సూర్యాపేట గ్రీన్ క్లబ్ అధ్యక్షుడు ముప్పారపు నరేందర్ అన్నారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా శనివారం ఉండ్రుగొండ గ్రామ శివారులోని గిరిదుర్గంలో గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌ను ఏరివేసే కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్పిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అదే విధంగా శాశ్వత బోర్డులు ఏర్పాటు చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో వినియోగించాల్సి వస్తే ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనల మేరకు నిర్ణీత మైక్రాన్ల ప్లాస్టిక్ వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా రెండు గంటల పాటు గిరిదుర్గంలో ప్లాస్టిక్ సేకరించి గ్రామ పంచాయతీ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ కార్యదర్శి తోట కిరణ్, ఉప్పల శ్రావణ్, మీలా మహదేవ్, మంత్రి జగదీశ్‌రెడ్డి ఏపీఎస్ డీఎస్‌వీ శర్మ, ఉప్పల శ్రీదేవి, డాక్టర్ సుధీర్, అంజన్ ప్రసాద్, ఉపేంద్ర చారి, ఎంపీఓ టి.గోపి, పంచాయతీ కార్యదర్శి బి.కవిత, క్రిష్ణమూర్తి, హేమమాలిని, సువర్ణ, లక్ష్మి, బంగారు, పద్మ, రజిని తదితరులు పాల్గొన్నారు.

### ఇన్‌చార్జ్ కార్యదర్శిగా పృథ్వీ

నడిగూడెం : నడిగూడెం గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా నారాయణపురం పంచాయతీ కార్యదర్శి పృథ్వీని నియమించినట్లు ఎంపీడీఓ ఎం.యద్రయ్య శనివారం తెలిపారు. నడిగూడెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రావణ్‌కుమార్ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి ఫిర్యాదు చేయడంతో ఆయన్ని డీపీఓ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

## అకాల వర్షం.. అన్నదాతకు తీవ్ర నష్టం



నాగారంలో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు



అర్వపల్లి : రామన్నగూడెం పీఏసీఎస్ కేంద్రంలో తడిసిన ధాన్యం



తుంగతుర్తిలో నీటిలో కొట్టుకుపోయిన ధాన్యం



చివ్వెంల : ఎర్రసూర్యాతండాలో..

నాగారం : మండలంలో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈదురు గాలులకు వరిచేలు నెలకొరగగా, మామిడి కాయలు, నిమ్మకాయలు నేలరాలయి. నాగారం, పస్తాల గ్రామాల్లోని ఐకేపీల్లో ధాన్యం తడిసి నీటిలో కొట్టుపోయింది. వర్ధమానుకోట, ఈటూరు, పసునూర్, ఫణిగిరిలో ధాన్యం స్వల్పంగా తడిసింది.

సూర్యాపేట రూరల్ : శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో మండలంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెన్‌పహాడ్ : మండలంలో శుక్రవారం రాత్రి అకాల వర్షం కురవడంతో మండలంలోని పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం స్వల్పంగా తడిసింది. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈదురు గాలుల వల్ల వరి పొలాలు నేలకొరగడంతో పాటు మండల పరిధిలోని అనంతారం, లింగాల, పొట్లపహాడ్, గాజులమల్కాపురం, దూపహాడ్ గ్రామాల్లోని మామిడి తోటల్లో మామిడికాయలు నేలరాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అనాజిపురం ఐకేపీ కొనుగోలు కేంద్రంలో 150 బస్తాల ధాన్యం తడిసినట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రంతో పాటు సింగారెడ్డిపాలెం, అనాజిపురం, మహ్మదాపురం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని తహసీల్దార్ శేషగిరిరావు, ఏఓ కృష్ణసందీప్, ఏపీఎం అజయ్‌లు పరిశీలించారు.

చివ్వెంల : ఆరుగాలం కష్టపడి పండించిన పంట వర్షానికి తడవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి ఐకేపీ కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి ముద్దయింది. అధికారుల నిర్లక్ష్యం వల్ల టార్పాలిన్ పట్టాలు ఇవ్వకపోవడం వల్లే తమ ధాన్యం తడిసిందని రైతులు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 20 ఐకేపీ, 5 పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది.

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని తహసీల్దార్ పుష్ప శనివారం పరిశీలించారు. కందగట్ల, నెమ్మికల్, మంగలితండా కేంద్రాలను పరిశీలించారు. వీరి వెంట ఏపీఎం మంజుల, ఏఓ దివ్య, సీసీలు చందు, నగేష్ ఉన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అర్వపల్లి శివారులో పిడుగుపడి తాటిచెట్టు దగ్ధమైంది. పలు గ్రామాల్లో చేతికొచ్చిన వరి పంటలు నేలకొరిగాయి. కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం రాశులు తడిసిపోయాయి. అర్ధరాత్రి వరకు అర్వపల్లిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉరుములు, మెరుపుల మూలంగా పలు ఇళ్లలో టీవీలు, ఎలక్ట్రానిక్స్ సామగ్రి, ఇన్‌వర్టర్లు కాలిపోయాయి. ఈదురు గాలికి మామిడి, నిమ్మచెట్ల కాయలు రాలిపోయాయి.

**అర్వపల్లిలో రాళ్ల వాన**

అర్వపల్లితోపాటు పలు గ్రామాల్లో శనివారం రాత్రి రాళ్ల వాన పడింది. ఒక్కసారిగా ఈదురు గాలితో వర్షం మొదలై ఆ తరువాత రాళ్ల వాన పడింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది.

నూతనకల్ : మండల పరిధిలోని గ్రామాల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు పంటలకు నష్టం వాటిల్లింది. కోతకు వచ్చిన వరి చేలు నేలవాలాయి. మామిడికాయలు నేలరాలడంతో రైతులకు తీవ్ర నష్టం చేకూరింది. వరి పంటలను వ్యవసాయ అధికారి మురళి, పండ్ల తోటలను ఉద్యానశాఖ అధికారి స్రవంతిలు పరిశీలించారు.

మద్దిరాల : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం రాత్రి అకాల వర్షానికి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. రెడ్డిగూడెంలో, కుక్కడం ఆవాసం దస్రు తండాలో పిడుగులు పడ్డాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి రైతులు వాపోతున్నారు.